# దెబ్బకు రోగం...

అన్నయ్య పెళ్ళయింది. పదహారురోజుల పండగ - అదీ ఇదీ అంటూ సంప్రదాయ పరంగా జరగవలసిన ముచ్చటలన్నీ జరిగి పోయాయి. ఆ తర్వాత వదిన కాపురానికి వచ్చింది.

వదిన మా ఇంటికి వచ్చిన రెండవరోజున, సాయంత్రం నాలుగున్నరకే మా అన్నయ్య ఆఫీసు నుంచి హడావుడిగా ఇంటికొచ్చాడు. "సుబ్బలక్ష్మీ! ఇప్పుడు మనం సినిమాకి వెళ్ళబో తున్నాం. నీ మేకప్‌తో ఆట్టే ఆలస్యం చేయక త్వరగా రెడీ అయి ఉండు... బైక్‌లో పెట్రోలైపో యింది. ఈలోగా నేనాపని చూసొస్తాను" అంటూ అంతే హడావుడిగా బయటివెళ్ళాడు.

అటు వదిన అలంకరణతో పాటు వదినను మేము ఆటపట్టించడం జరుగుతూండగానే అన్నయ్య రావడం, వాడు రెడీ అయి ఇద్దరూ బైక్ మీద "ఝూం" అంటూ సినిమాకు వెళ్ళడం - అన్నీ చకచకా జరిగిపోయాయి. అన్నయ్య చేసిన హడావుడికి మేమంతా ఫక్కున నవ్వు కున్నాం.

రాత్రి ఎనిమిదిన్నర కావొస్తోంది. మేము వంట ముగించుకుని కూర్చున్నామో లేదో సినిమాకు వెళ్ళినవాళ్ళు తిరిగిరానే వచ్చేసారు. అన్నయ్య ముఖం కోపంతో చిటపటలాడు తోంది. వదిన ముఖం దీనంగా ఉంది.

ఆ రాత్రి వాళ్ళిద్దరూ భోంచెయ్యలేదు.


**మంజరి.కె.జె.**

ఆ మర్నాడు వదినను కారణం చెప్పమని ఎంత బ్రతిమిలాడినా, అసలేం జరిగిందో చెప్పలేదు. మాకూ అర్థం కాలేదు. ఆ తర్వాత అన్నయ్య వదినను సినిమాకి కాదుకదా, కనీసం కాసేపు బయటక్కూడా తీసుకెళ్ళేవాడు కాదు. కొత్త పెళ్ళికూతురు. తన ఆశలు తనకి ఉంటాయి. వదినను చూస్తే 'అయ్యో పాపం!' అన్పించేది. ఇంట్లో వంటరిగా ఎంతసేపని ఉంటుంది? ఒకసారి మాతోపాటు వదినను కూడా సినిమాకి తీసుకెళ్ళాం.

అప్పుడు తెలిసింది అన్నయ్య ఆగ్రహానికి కారణం.

కొంతమందికి కొన్నిరకాల వింత అల వాట్లు ఉంటాయి. వాటిలో కొన్ని నవ్వు తెప్పిం చేవిగాను, కొన్ని అసహ్యించుకునేవి గాను, కొన్ని భయపెట్టేవిగానూ ఉంటాయి. ఇలాంటి అలవాట్లలో ఒకటి మా వదినకి ఉంది.

చాలా సంతోషం కలిగినప్పుడు... సినిమా లలో వచ్చే జోక్స్‌కి కడుపుబ్బ నవ్వుతూ పక్క నున్నవారి వీపు మీదో, తొడమీదో ఓ చరుపు చరుస్తుంది. దరువు సాగిస్తుంది. ఆ దెబ్బకూడా చాలా ఫోర్స్‌గా తగుల్తుంది. ఇదేమీ గమనించు కోకుండా సినిమాలో లీనమైపోయి, పక్కనున్న వార్ని ఇబ్బందికి గురిచేస్తున్నానన్న స్పృహ కూడా లేకపోవడం - పక్కనున్న వారి దుర దృష్టం. చేసుకున్నవారికి చేసుకున్నంత అన్నట్టు వదిన అలవాటుని ఓర్పుతో, సహనంతో చాన్నాళ్ళు భరించాం. ఈ అలవాటు మాన్పిం చాలని మా వంతుగా ఎన్నో ప్రయత్నాలు చేసాం. సైకియాట్రిస్ట్ దగ్గరక్కూడా తీసుకెళ్ళా



లని విశ్వప్రయత్నం చేసాం. కానీ వదిన 'రాను గాక రాను' అని మొండికేసింది. చేసేదిలేక అందరం చేతులెత్తేసి ఊరుకున్నాం.

వదిన అలవాటు తెలిసాక, సినిమా కెళ్ళి నప్పుడు ఇంట్లో అందరం ఆమె పక్కన కూర్చో డానికి భయపడేవాళ్ళం. వదిన పక్కన కూర్చో డానికి వంతులు వేసుకునేవాళ్ళం.

చాన్నాళ్ల తర్వాత మళ్ళీ వచ్చిన "పరమా నందయ్య శిష్యుల కథ" సినిమాకు వెళ్దామను కున్నాం. ఆ సినిమా ఎన్నిసార్లు వచ్చినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది.

వదినతో రాజేంద్రప్రసాద్ సినిమాకో, శ్రీ లక్ష్మి - సుత్తివేలు - వీరభద్రరావుల కామెడీ సీన్లున్న సినిమాలకు వెళ్తేనే - ఆమె పక్కన కూర్చున్నవారి తొడ మంట పుడ్తుంది. ఇక ఫుల్ కామెడీ - ఈ పరమానందయ్య శిష్యులు సిని మాతో పక్క నున్నవారి తొడ హరోంహర! ఆశ వదిలేసుకోవాల్సిందే.

ఆనవాయితీ ప్రకారం వదిన పక్కన కూర్చు నే వంతు ఈసారి నాదయింది. సినిమా కెళ్దా మని నిర్ణయించుకున్నప్పట్నుంచీ ఇంట్లోని వాళ్ళంతా నన్ను 'టీజ్' చేయడం మొదలు పెట్టారు. "అమృతాంజనం రెడీగా పెట్టుకో" అని ఒకరు, "పసరాకు పట్టీ వేస్తాంలే" అని మరొకరు, "ఈ దెబ్బతో నీ తొడకు ఆయువు మూడినట్టే" అని ఇంకొకరు. నా మీద బోలెడు జాలి కురిపిస్తూ, వల్లమాలిన సానుభూతి చూపుతున్న ముఖాలు పెట్టి తలో జోకూ వేస్తుంటే నాకు కంపరం వేసింది.

"వదినకు ఆడపడుచు సగం అర్ధాంగితో సమానం" అనే సామెత నాకు ఈ కోణంలో అర్థం కావడం నా దురదృష్టకరం. ఇలాంటి వదినను మాకు అంటగట్టినందుకు మా అన్న య్య మీద పీకల్దాకా కోపమొచ్చింది.

నా చిరాకు, పరాకూ చూసి "పోనీలే! ఈసారికి మీరు వెళ్ళిరండి. సినిమా చూడాలని నాకూ ఉందిగానీ... ప్రాప్తం లేదు" అంటూ బాధగా ముఖం పెట్టింది. నాకు జాలేసింది.

"నువ్వు సినిమా మానుకోవడమెందుకూ? మేము నిన్ను రావద్దని చెప్పలేదుకదా వదినా!" అంటూ అనునయించబోయాను.

అంతే... నా చేతులు దగ్గరకు తీసుకొని భోరుమని ఏడ్చినంత పని చేసింది వదిన.

వెక్కిళ్ళు పెడుతూ అసలు విషయం బయట పెట్టింది. "నేను కూడా నా శాయశక్తులా అలా జరక్కూడదని ప్రయత్నిస్తూనే ఉంటాను. సిని మాకు బయల్దేరేముందు అలా జరక్కుండా చూడు భగవంతుడా! అనుకుంటూనే బయల్దేర తాను. తీరా సినిమాలో లీనమైపోయాక నన్ను నేను మర్చిపోతుంటాను... నేను రెండు మూడు తరగతులు చదువుతున్నప్పట్నుంచీ నాకీ అలవా టుంది. మీకు చికాకు, మీ అన్నయ్యకు కోపం తెప్పించాను... ఆ రోజు... మేమిద్దరం మొదటి సారి సినిమాకెళ్ళినప్పుడూ అంతే... మీ అన్న య్య తొడమీద చాలాసార్లు చరిచానట... నేను అలా కొట్టినందుకు కాదుగానీ మా పక్క సీట్లో వాళ్ళు నవ్వినందుకు మీ అన్నయ్యకు కోపం వచ్చింది. నాతో ఇక మీరీ తిప్పలు పడలేరు గానీ... నన్ను ఇంట్లో ఒంటరిగానే ఉండని వ్వండి..." అంది.

మరింత జాలివేసి మేమే బలవంతంగా వదినను సినిమాకు తీసికెళ్ళాం.

ఆ రోజు ఆదివారం కావడంతో చాలా రద్దీగా ఉంది. టిక్కెట్లయితే దొరికాయిగానీ, అందరికీ ఒకచోట సీట్లు దొరకలేదు. నేనూ- వదిన ఒక దగ్గర కూర్చున్నాం. పరమానం

దయ్యి శిష్యులు మామూలుగా ఉన్నంత సేపూ బాగానే గడిచింది. ఇక అసలు కథ ప్రారంభ మవుతుందనగానే, నా ప్రాణాలు నాలో లేకుం డా పోయాయి.

నా పక్క సీట్లో పదేళ్ళమ్మాయి కూర్చుంది. ఆ పిల్లకి ముందు సీట్లో కూర్చున్న మనిషి చాలా ఎత్తుగా ఉండటం వల్ల ఆ అమ్మాయికి సినిమా కన్పించడం లేదు. అతణ్ణి తిట్టుకుంటూ విసుగ్గా కూర్చుంది. ఆ అమ్మాయిని నా సీట్లోకి రమ్మని, నేను ఆ అమ్మాయి సీట్లోకి మారాను. సీటు మారాక సినిమా చక్కగా చూడగల్గుతున్నందుకు సంతోషపడింది ఆ అమ్మాయి. అయితే సీట్ల మార్పిడి నేను కావాలని చేసింది కాదు. అప్ర యత్నంగా అలా జరిగిపోయింది.

సినిమాలో లీనమైపోయిన వదిన ఈ సీట్ల మార్పిడి గమనించలేదు. ఇంతలో మునులు శిష్యులుగా మారారు. ప్రేక్షకుల్ని నవ్వించడం మొదలు పెట్టారు. హాలంతా నవ్వులతో మోగిపోతోంది. మా వదిన తన అలవాటు ప్రకారం చెయ్యిఎత్తింది. మా వదిన చెయ్యి ఇలా తగిలిందో లేదో వదిన వీపు మీద "ఢన్" మని ఒక గుద్దుగుద్దింది ఆ అమ్మాయి.

అక్కడ ఏం జరుగుతోందో అని గమనిం చిన నాకు ముందు చాలా ఆశ్చర్యం వేసింది. ఆ తర్వాత పొట్ట చెక్కలయ్యేలా నవ్వు వచ్చింది.

నవ్వొచ్చే దృశ్యాలొచ్చినప్పుడు మా వాళ్ళందరి దృష్టి మా వదిన మీద ఉండటం సహజం. ఆ దృశ్యాన్ని చూసి విరగబడి నవ్వారు అందరూ.

వదిన అలవాటుని, హింసనీ భరించ వలసిన అవసరం మాకయితే ఉందిగానీ - సహించవలసిన అవసరం ఆ అమ్మాయి కెందుకుంటుంది? వదిన చెయ్యి చురుగ్గా తగల

> "ఏమండోయ్! మన బాబుకి మాట్లా డటం వచ్చిందండోయ్–" అంది రాజకీయ నాయకుడి భార్య సంతోషపడిపోతూ.
>
> "ఏమంటున్నాడేమిటి?" అనాసక్తిగా అడిగాడు ఆ నాయకుడు.
>
> "అదే అర్థం కావట్లేదు... బహుశా రాజ కీయాలేమో!" అంది పిల్లాడివంక మురిపెం గా చూస్తూ.

డంతో, తట్టుకోలేని ఆ పిల్ల కక్ష కొద్దీ వదిన వీపు మీద గుద్దింది. వదిన ముఖం పాలిపో యింది. సిగ్గుతో తలవంచుకుంది.

వదినకున్న అలవాటు తెలియని ఆ పిల్ల – తనను కావాలని కొట్టిందనుకొని, వదినను తిరిగి కొట్టింది. కొడితే కొట్టింది కానీ "దెబ్బకు రోగం బలాదూర్" అనిపించింది.

ఆ రోజు నుంచి ఎంత కామెడీ సినిమా కెళ్ళినా, పొట్ట చెక్కలయ్యేలా నవ్వొచ్చే సీన్లు వచ్చినా – వదిన పక్కన నిశ్చింతగా, నిరభ్యం తరంగా, హాయిగా కూర్చోగలుగుతున్నాం.

వదినలో వచ్చిన ఈ పరివర్తనకు, హఠాత్ పరిణామానికీ మూలకారణమైన నాకు 'థాంక్స్' చెప్పడమేకాదు – ఇంట్లో అందరికీ స్వీట్లు పంచి, పెళ్ళాంతో పదేపదే సినిమాలకు చెక్కేస్తూ మా అందర్నీ నవ్వుల్తో ముంచేస్తున్నాడు మా అన్నయ్య.

ఇంతకీ – మా వదిన పేరు 'సుబ్బలక్ష్మి' అని చెప్పాను గానీ మా అన్నయ్య పేరు చెప్పలేదు కదా? సుబ్బారావు.

అదండీ 'సుబ్బారావూ–సుబ్బలక్ష్మి'ల కథ

మళ్ళీ ఇలాంటి మరిన్ని చిత్రమైన "మా వదిన కబుర్లు"తో మిమ్మల్ని మరోసారి కలుస్తాను... ఉంటాను మరి. ●